'నవతెలంగాణ' ప్రథమ వార్షికోత్సవ
ప్రత్యేక ప్రచురణ

# సమకాలీనం



నవతెలంగాణ పబ్లిషింగ్ హౌస్

116624

ప్రచురణ సంఖ్య : 1388

ప్రథమ ముద్రణ : మార్చి, 2016

వెల : ₹ 50/-

ప్రతులకు : నవతెలంగాణ పబ్లిషింగ్ హౌస్
ఎమ్.హెచ్. భవన్, ప్లాట్ నెం. 21/1, అజామాబాద్
ఆర్‌టిసి కళ్యాణమండపం దగ్గర, హైదరాబాద్ -20
ఫోన్ : 040 - 27660013

బ్రాంచీలు : నవతెలంగాణ పబ్లిషింగ్ హౌస్ బ్రాంచీలు
హైదరాబాద్ - చిక్కడపల్లి, బాగ్‌లింగంపల్లి (ఎస్.వి.కె.), ఇ.సి.ఐ.ఎల్.,
నల్గొండ, హన్మకొండ, కరీంనగర్, ఖమ్మం, నిజామాబాద్

ప్రజాశక్తి బుక్‌హౌస్ బ్రాంచీలు
విజయవాడ, గుంటూరు, విశాఖపట్నం, తిరుపతి, ఒంగోలు, నెల్లూరు

ముద్రణ : నవతెలంగాణ ప్రింటర్స్ ప్రై. లిమిటెడ్, హైదరాబాద్

# 1

# మనిషి కోసమా? మార్కెట్ కోసమా?

**మానవత్వం, మానవీయ కోణం నిన్నటి మాటలు... మార్కెట్ వేటలో మనీ మూటల మధ్య, మనిషికి విలువేమున్నది? మార్కెట్ విలువల హోరులో 'విలువ'ల వలువలు కొట్టుకుపోతున్న సమాజంలో డాక్టరైతేనేమి? యాక్టరైతేనేమి? విద్యావేత్తలైతేనేమి? శాస్త్రవేత్తలైతేనేమి? స్త్రీ పురుష భేదమేమున్నది? లాభమే పరమావధిగా నడుస్తున్న సమాజమిది... నడుపుతున్న సమాజమిది. లాభనష్టాలే గీటురాయి. సంపాదనే అంతిమ లక్ష్యం. అందుకేది అడ్డమొచ్చినా లెక్కచేయదు. ఎదుటివారి ప్రాణమైనా... యజమాని ప్రాణమైనా...**

డాక్టరు మీద డాక్టరు కాల్పులు జరిపాడు. ప్రాణాలు కాపాడవల్సిన డాక్టరు, ప్రాణాలు కాపాడే మరో డాక్టరు ప్రాణాలు తీసేందుకు ప్రయత్నించాడు. ఇదేమి వైపరీత్యమని సగటు మనిషి ముక్కుమీద వేలేసుకున్నాడు. లాభాల వేటలో... పంపకాల పోట్లాటల ఫలితమిది. మార్కెట్ పేరుతో ఆధునిక సమాజం సృష్టించిన విలువల పర్యవసానం. చదివింది వైద్యశాస్త్రమే! నేర్చుకున్నది ప్రాణాలు నిలబెట్టే విద్య. అయినా... ఇప్పుడు రోగుల బాధలు పట్టవు. పేదల వేదనలు పట్టించుకోరు. 'మనీ' వాదం ముందు హృదయవేదనకు స్థానం లేదు. విద్యా, వైద్య రంగాలలో కార్పొరేట్ సంస్థల ప్రవేశపు వికృత విన్యాసఫలమిది.

**లాభాల వేట**

ర్యాంకుల కోసం విద్యార్థుల పరుగులు... ర్యాంకులొచ్చిన విద్యాసంస్థకు మార్కెట్‌లో గిరాకీ! అందుకే జ్ఞానం కన్నా, సృజనశీలత కన్నా ర్యాంకు విలువలే మిన్న.

చివరకు విద్యార్థులమీదా, వారిని కన్న తల్లిదండ్రుల మీదా ఇదే ప్రభావం. వైద్యరంగంలోనూ ఇదే తంతు. ప్రతి మనిషికీ బతకాలన్న ఆశ. మరోవైపు బతుకుమీద జనంఆశను సొమ్ముచేసుకుంటున్న లాభాల పేరాశ. ఆస్తులు అమ్ముకోక తప్పని స్థితిని సృష్టిస్తున్న పెట్టుబడి పేరాశ. ఇదే నేటి దశ... దిశ.

**వైద్యులా? లాభార్జన సాధనాలా?**

వైద్యులు వైద్యులుగా వ్యవహరించాలో లేక లాభార్జన సాధనంగా పనిచేయాలో అర్థంకాని విచిత్ర పరిస్థితి. కార్పొరేట్ వైద్యశాల యజమాని లాభతృష్ణకూ, రోగి వేదనకూ మధ్య నలుగుతున్న కొందరు వైద్యుల సంకట స్థితి. వైద్యులుగా ఉన్నంత వరకు వైద్య విద్య నభ్యసించిన వారంతా వైద్యులే. కానీ పెట్టుబడి పెట్టిన క్షణం నుండి వైద్యులలో కార్పొరేట్ శక్తి పరకాయ ప్రవేశం చేస్తున్నది. వైద్యం కన్నా లాభం కోసమే అనుక్షణం అన్వేషించమంటున్నది. అవును కదా! ఇది పెట్టుబడి లక్షణం. పెట్టుబడిదారీ వ్యవస్థలో మానవ సంబంధాలన్నీ డబ్బు సంబంధాలేనన్నారు కారల్‌మార్క్స్. అదే కదా ఇప్పుడు జరుగుతున్నది! డాక్టరు పెట్టుబడిదారుగా మారి, మరికొందరు డాక్టర్లను నియమించుకుని వైద్యం చేయిస్తున్నాడు. వేతనం ఎంత కావాలో చెప్పాలంటున్నాడు. కావాంటే కమీషన్ కూడా తీసుకోమంటాడు. తనకు మాత్రం లాభం రావాలి. అదీ... తొందరగా రావాలి. అందుకోసం అవసరం ఉన్న మందులూ, పరీక్షలతో బాటు, అవసరం లేనివి కూడా రాయాలి. రోగి ఆర్థిక పరిస్థితికీ, కుటుంబ వేదనకూ ఈ యజమానికి సంబంధంలేదు. మధ్యలో రోగికి వైద్యం అందిస్తున్న వైద్యులకూ సంబంధం ఉండకూడదు. మానవత్వం మంటగలిసిందని తిట్టిపోస్తే ప్రయోజనం లేదు. మానవత్వం, సామాజిక ప్రయోజనం, సేవా దృక్పథం మంటల్లో కాలిపోలేదు. పెట్టుబడి లాభాపేక్షలో దహించుకు పోయాయి. 'రోగం-వైద్యం' స్థానంలో 'పెట్టుబడి-లాభం' ప్రవేశించింది. వైద్యశాల ఒక విలాసవంతమైన హోటల్ స్థాయికి పరిణామం చెందింది. ప్రభుత్వాలు 'విలాస' పన్నులు వేసి ఖజానా నింపుకుంటున్నాయి.

**అందరు నడిచే దారిలోనే...**

వైద్యులూ, ఉపాధ్యాయులూ దైవసమానులని నమ్మే అమాయకజనం మనవారు. పాత అనుబంధాలకూ, మార్కెట్ సంబంధాలకూ మధ్య ఊగిసలాడుతున్న లోలకపు బతుకులివి. వైద్యులూ, ఉపాధ్యాయూలూ లాభార్జనలో కొంత సంయమనం పాటిస్తారని

అమాయకజనం ఆశ! వ్యాపార సమాజంలో తోటివారు లాభాలు గడిస్తుంటే... ఉపాధ్యాయులో లేక వైద్యులో అయినంత మాత్రాన, వీరికి మాత్రం ఆ కోరిక కలుగదా? వీరు కూడా మనుషులే కదా! ఎవరు లాభాపేక్ష పరులైనా, వీరిద్దరూ కాకూడదని జనం కోరిక. అది వారి అవసరం. అంతమాత్రాన అందరూ నడిచే బాట వదిలి ఇంకోబాట నడవమంటే వారు మాత్రం ఎందుకు నడుస్తారు?

**విపరీత ధోరణులు**

ఇవన్నీ సరే. చంపుకోవటం, చచ్చిపోవటం ఎందుకు? ఇదీ అమాయక జనం వేసే ప్రశ్నే! అక్రమ సంపాదన ఉన్న దగ్గర గన్నూ... మాఫియా... అభద్రతా భావం సహజీవనం చేస్తాయి కదా! ఇవి కూడా పెట్టుబడి విషపుత్రికలే కదా! చదివింది వైద్యశాస్త్రమా లేక విద్యశాస్త్రమా అన్నదానితో సంబంధం లేదు. చేస్తున్నదేకీలకం. మందుల కంపెనీలు, పరికరాల ఉత్పత్తి సంస్థలు, ఇన్సూరెన్స్ సంస్థలు, కార్పొరేట్ వైద్యులు కుమ్మక్కయ్యే మార్కెట్ మాయాజాలమిది. అది విద్యారంగమైనా, వైద్యరంగమైనా, సాంస్కృతిక రంగమైనా, మరొకటైనా... అంతే కదా!

విద్యా వైద్య రంగాలలో ప్రభుత్వాలు చేతులెత్తేసిన తర్వాత ఇక కార్పొరేట్ సంస్థలు కాక ఎవరు ప్రవేశిస్తారు? సంపాదనకు అనువైన మార్గాలుగా వీటిలో కూడా అవకాశం ఇస్తే.... కార్పొరేట్ యజమానులకింతకన్నా ఏంకావాలి? విద్యా, వైద్యం అనివార్యమైన అవసరాలు. గ్యారంటీ లాభాలకు అనువైన రంగాలు. ఇవి ప్రైవేటు చేతుల్లో చిక్కిన తర్వాతనే ఈ విపరీత ధోరణులు వ్యాపిస్తున్నాయి.

**ప్రశ్నించే నోరు మూయించేందుకు కూడా**

'ఆధునిక' ప్రపంచంలో కూడా విద్యా, వైద్య రంగాలు ప్రభుత్వ బాధ్యతగానే ఉండాలన్నారు ఆర్థికరంగంలో నోబెల్ బహుమతి గ్రహీత అమర్త్యసేన్. 'అభివృద్ధి' చెందిన దేశాల అభివృద్ధి రహస్యం కూడా ఇదేనన్నారు. అయితేమాత్రం? లాభాపేక్ష ముందు ఈ 'నీతులు' ఏపాటివి? పైగా ఇది ఆశ్రిత పెట్టుబడిదారీ యుగం. అధికారాన్ని అడ్డం పెట్టుకుని అడ్డగోలుగా కొల్లగొట్టవచ్చు. అందుకే కదా... మంత్రివర్గాలలో కార్పొరేట్ విద్యా, వైద్య సంస్థల యజమానులకు పెద్దపీట! కాల్పులకు, కాల్చుకోవడానికి దారితీసిన ఈ ప్రయోజనాలే రేపు... వీటిని ప్రశ్నించిన వారిమీద కూడా గురిపెడతాయి. జనం

నోరు మూయించేందుకు, నిలదీసే శక్తిని అణచేందుకు కూడా కాల్పులకు వెనుకాడవు. అప్పుడు పోలీసులే ఈ ప్రయోజనాల రక్షకులవుతారు. ప్రజల పాలిట భక్షక భటులవుతారు.

**ఆచారంగా మారుతున్న అత్యాచారాలు**

ఈ ధోరణులు విద్యా, వైద్య రంగాలకే పరిమితమా? పెట్టుబడి సర్వాంతర్యామి. దాని ప్రభావాలూ, పర్యావసనాలూ అంతే మరి. స్త్రీని 'ఆడది' కాదు... ఆదిపరాశక్తి అన్నారు. అంటున్నారు. తల్లిగా, చెల్లిగా, చెలియగా ఎంతో గౌరవప్రదమైన స్థానం అంటున్నవారే దేశాన్ని ఏలుతున్నారు. అయితే... గౌరవం సంగతేమోగానీ... లైంగిక దాడులు నిత్యకృత్యమైనాయి. పసిబాలిక నుండి పండు ముదుసలి వరకు భద్రత కరువైంది. పెట్టుబడి విరజిమ్మిన విషతుల్యమైన ధోరణుల పర్యవసానమిది. మార్కెట్ లాభాల కోసం వ్యాపార సరుకుగా స్త్రీని వాడుకుంటున్న ఫలితమిది. మనిషిగా చూడటం కన్నా మార్కెట్ సరుకుగా చూడటమే ప్రధానమైంది. నచ్చిన సరుకును వాడుకున్నట్టే... మహిళనూ వాడుకునే ధోరణుల సృష్టికర్త ఈ పెట్టుబడి. అందుకే అత్యాచారాలే ఆచారాలుగా మారుతున్నాయి. అందుకవసరమైన విలువలూ విస్తరిస్తున్నాయి. ఇప్పుడు విలువలు మనిషికోసం కాదు. మనసున్న మనిషి కోసం అసలే కాదు. మార్కెట్ కోసమే!

**'మనీ' ప్రతినిధులు**

'మన' ప్రయోజనం స్థానంలో మనీ ప్రయోజనం ముందుకొచ్చింది. ప్రజా ప్రతినిధులు మనీ ప్రతినిధులుగా రూపాంతరం చెందారు. 'ప్రజల నుండి, ప్రజలచేత, ప్రజల కొరకు' అన్న సూత్రం ఇప్పుడు 'డబ్బు నుండి డబ్బుచేత డబ్బుకొరకు' అన్న సూత్రంగా మారింది. నిన్నటిదాకా వీరు ప్రజాప్రతినిధులు. ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యం. ప్రజాప్రయోజనాలే ముఖ్యం. ప్రజాసేవయే జీవిత ధ్యేయం. ఇప్పుడు 'మనీసేవ'గా మారిపోయింది. స్వీయ సేవకు పదవి లక్ష్యమైంది. తన ప్రయోజనాన్ని 'మన' ప్రయోజనంగా చెప్పి సొమ్ము చేసుకుంటున్నారు. అందుకే ఏపార్టీ నుండి గెలిచావు? ఏపార్టీలోకి ఫిరాయించావన్న దానికి విలువలేదట! ఎంత సంపాదించావన్న దానికే విలువ. ఇదొక యజ్ఞం. ఓటేసిన జనమే ఇందులో సమిధలు. ఓట్లైనా... సీట్లైనా... పదవులైనా... ప్రజల కోసమనుకుంటే పొరపాటే! మనిషి కోసమేనన్నది గతం. మార్కెట్ కోసమేనన్నది నేటి నిజం!

**మనిషికోసం...**

ప్రజా ప్రయోజనాల కోసమే పాలకులు పనిచేయాలంటే కాలం చెల్లిన సిద్ధాంతమంటున్నారు. పెట్టుబడి కోసం పనిచేయటమే 'అభివృద్ధి' సంకేతం. 'ఆధునికత'కు ప్రతిరూపం. ఉగ్రవాదాన్ని నిర్మూలించాలా? లేక ఉగ్రవాదిని నిర్మూలించాలా? ఉగ్రవాదాన్ని నిర్మూలించాలన్న వారందరినీ, ఉరిశిక్షను రద్దుచేయాలన్న వారందరినీ ఉగ్రవాదులంటారు. దేశద్రోహులని ముద్రవేసి దేశద్రోహానికి ఒడిగడతారు. దేశభక్తి ముసుగులో దేశద్రోహం... పెట్టుబడి వ్యామోహం! ఉగ్రవాదిని ఉరితీస్తే... జనం ఆలోచనలన్నీ ఉరిశిక్షల చుట్టూ తిప్పుతూ కాలం గడపవచ్చు. ఉగ్రవాదమే నిర్మూలిస్తే... ఇక జనం దృష్టి పెట్టుబడి విశృంఖలత్వం మీద పడుతుంది. మార్కెట్ మాయాజాలాన్ని ఛేదించేందుకు ప్రయత్నిస్తుంది. అందుకే... ప్రజా ప్రయోజనం చాటున మార్కెట్ జపం చేస్తున్న కాలం. మార్కెట్ కోసమే నడిచినంత కాలం మనిషికి దక్కేదేముంటుంది? మనిషి కోసం ఏదైనా సాధించాలంటే మార్కెట్‌ను ప్రశ్నించవల్సిందే కదా!

**- 13.2.2016**

**End of Preview.**

**Rest of the book can be read @**

[http://kinige.com/book/Samakaleenam+Navatelangana+Publishing+House](http://kinige.com/book/Samakaleenam+Navatelangana+Publishing+House)

* * *